ప్రజాశక్తి
శుక్రవారం 28 నవంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

రాజధాని విస్తరణకు సిఎం మొగ్గు

29 గ్రామాలతో అయితే చిన్న మున్సిపాల్టీ అవుతుందని వ్యాఖ్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిని మెగా సిటీగా మార్చాలని సిఎం చంద్రబాబు యోచిస్తున్నారు. ఇందులో భాగంగా రెండో విడత భూ సమీకరణ పథకంపై ఆయన సానుకూలంగా స్పందించారు. రాజధాని విస్తరణకే ఆయన మొగ్గుచూపారు. గురువారం సాయంత్రం సచివాలయంలో 29 గ్రామాల రైతులతో మాట్లాడిన ఆయన.. హైదరాబాద్ తరహాలో అమరావతి అభివృద్ధి చెందాలంటే 29 గ్రామాల పరిధి సరిపోదని వ్యాఖ్యానించారు. 29 గ్రామాలకే పరిమితం చేస్తే ఒక చిన్న మునిసిపాలిటీగా మాత్రమే అమరావతి ఉంటుందని చెప్పారు. అమరావతి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే విస్తరణ అనివార్యమన్నారు. దీంతో మలివిడత భూ సమీకరణ అనివార్యంగా కన్పిస్తోంది. మలివిడత 34 వేల ఎకరాల భూములను రాజధాని కోసం తీసుకునేందుకు సిఆర్‌డిఎ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ మేరకు భూ సేకరణకు సంబంధించిన విధి విధానాలతో మునిసిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ జులై ఒకటో తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. 2015లో రాజధాని అమరావతిలో ప్రారంభమైన భూ సమీకరణలో భూములిచ్చిన రైతులకు ఇచ్చిన ప్యాకేజిని మలి విడతలో కూడా అమలు చేయనున్నారు. రాజధాని నిర్మాణంలో భాగంగా భూములు ఇచ్చే రైతులకు ఒనగూరు ప్రయోజనాలు వివరిస్తూ ఈ నోటికేషన్ విడుదల చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఎం, హాజరైన రాజధాని రైతులు

2015లో మొదటి విడత భూములు అప్పగించిన రైతులకు అందించిన ప్యాకేజీని రెండో విడతలోకూడా కొనసాగించారు. మలి విడతలో గుంటూరు జిల్లాలోని తాడికొండ, పెదకాకాని, పల్నాడు జిల్లాలోని అమరావతి, పెదకూ రపాడు మండలాల్లోని 24 గ్రామాలకు చెందిన రైతుల నుంచి భూ సమీకరణ చేయడానికి గ్రామ సభలు కూడా నిర్వహించారు.

అయితే కొన్ని గ్రామాల్లో రైతులు వ్యతిరేకించారు. గత మే, జూన్ నెలల్లో తుళ్లూరు, తాడికొండ, అమరావతి, పెదకూరపాడు మండలాల్లో గ్రామసభలు నిర్వహించి అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులతో చర్చించారు. ఎక్కువ మంది రైతులు మలి విడత భూ సమీకరణను వ్యతిరేకించారు. అయినా ప్రభుత్వం జూన్ 24న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో మలివిడత భూ సమీకరణకు ఆమోదం తెలిపింది. మంత్రి వర్గం నిర్ణయం మేరకు జులై ఒకటిన భూ సమీకరణకు అనుమతిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొదటి విడత ప్యాకేజిని తిరిగి ప్రకటించారు. 2015లో రాజధాని గ్రామాల్లో ఉన్న భూముల ధరలకు 2025లో రాజధాని బయట గ్రామాల్లో భూముల ధరలకు భారీ వ్యత్యాసాలు ఉన్నాయని రైతులు వాదించారు. 2015లో రాజధానిలోని 29 గ్రామాల్లో భూముల ధరలు అతి తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు రాజధాని పరిసర గ్రామాలు, మండలాల్లో భారీగా ధరలు పెరిగాయని అందువల్ల ప్యాకేజి మార్చాలని కూడా కోరారు.

▶ 2లో



గుంటూరు ఛానల్ విస్తరణకు

భూసేకరణపై ప్రతిష్టంభన

- మార్కెట్ విలువ ఇవ్వాలని రైతుల విజ్ఞప్తి
- రిజిస్ట్రేషన్ ప్రకారం ఇస్తామంటున్న అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, పొడిగింపునకు సంబంధించి చేపట్టిన భూ సేకరణపై ప్రతిష్టంభన నెలకొంది. ఎన్నో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ ఛానల్ ఆధునికీకరణ, పొడిగింపునకు సంబంధించి అంచనాలు గణనీయంగా పెరిగాయి. ఛానల్ విస్తరణ, పొడిగింపునకు రూ.625 కోట్ల అంచనాలతో మెగా ఇంజినీరింగ్ కంపెనీకి టెండర్లు ఖరారు చేశారు. ఇందుకు సంబంధించి మొత్తం 11 గ్రామాల్లో భూ సేకరణ చేయాల్సి ఉంది. తొలి విడత ఏడు గ్రామాల్లో భూ సేకరణకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. వట్టిచెరుకూరు మండలం గారపాడు, ప్రత్తిపాడు మండలం కొండేపాడు, యనమదల, ప్రత్తిపాడు, మల్లాయపాలెం, పెదనందిపాడు మండలం గొరిజవోలు గుంటపాలెం, రావిపాడు గ్రామాల్లో మొత్తం 201.19 ఎకరాల భూమిని రైతుల నుంచి తీసుకోవాలని నిర్ణయించారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం మొత్తం రూ.120 కోట్ల వరకు భూ సేకరణకు ఖర్చవుతుందని అంచనా ఉండగా రూ.80 కోట్లు విడుదలయ్యాయి. తొలి విడత రూ.58 కోట్లు పనులకు, రూ.75 కోట్లు భూ సేకరణ నిమిత్తం ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం ఏడు గ్రామాల్లోని రైతులు తమకు మార్కెట్ ధర ప్రకారం సొమ్ము ఇవ్వాలని కోరుతున్నారు. అయితే రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం చెల్లించేందుకు అధికారులు రైతులతో చర్చిస్తున్నా తుది నిర్ణయం వెలువడలేదు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ విలువపై రెండున్నర రెట్లు కలిపి ఇవ్వాలని రైతులు అధికారులను కోరినా అధికారులు సేసేమిరా అనడంతో భూ సేకరణ దశలోనే ప్రతిష్టంభన నెలకొంది.

ఉండవల్లి నుంచి ప్రస్తుతం యామర్తి వరకు ఉన్న ఈ ఛానల్ ప్రస్తుతం ఉన్న 47 కిలో మీటర్లనుంచి 75.03 కిలో మీటర్ల వరకు పొడిగింపునకు ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ఛానల్ ద్వారా ప్రస్తుతం 27 ఎకరాలకు నీరు అందిస్తున్నారు. పొడిగించడం వల్ల మొత్తం 48 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గుంటూరు ఛానల్ పరిధిలో 38,400 ఎకరాలు కొత్త ఆయకట్టు కాగా 9600 ఎకరాలు నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో ఉంది. మొత్తం 29 కిలో మీటర్ల పొడిగింపు అంచనాలు కాగా ఇందులో గుంటూరు జిల్లా పరిధిలో 23.54 కిలో మీటర్లు, బాపట్ల జిల్లా పరిధిలో 4.50 కిలో మీటర్లు ఉంది. గుంటూరు జిల్లా పరిధిలో 381.34 ఎకరాలు, బాపట్ల జిల్లా పరిధిలో 49.40 ఎకరాలు సేకరిస్తారు. బాపట్ల జిల్లా అధికారులు ఇంకా భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వలేదు. ప్రస్తుతం ఉన్న ఛానల్‌ను జిరో టు 47 కిలో మీటర్ల వరకు ఆధునీకరణ పనులు కూడా చేపట్టాల్సి ఉంది. అయితే తొలి విడత ఇచ్చిన నోటిఫికేషన్ ఆదారంగా భూ సేకరణ ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు పి.వెంకటరత్నం ప్రజాశక్తికి తెలిపారు. ఇందుకు రైతులకు ఇచ్చేందుకు రూ.80 కోట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. మరో నాలుగు గ్రామాల్లో నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. అనపర్రు, వరగాని, పాలపర్రు, రాజుపాలెం గ్రామాల్లో భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. భూసేకరణ పూర్తయితే ఫిబ్రవరి నుంచి విస్తరణ, పొడిగింపు పనులు ప్రారంభం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



మోడల్‌పేపర్లను ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, ఎన్.వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు

యుటిఎఫ్ ఎస్ఎస్‌సి మోడల్ పేపర్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

రాబోయే మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల సౌలభ్యం కోసం యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను బ్రాడీపేట 2/6లోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు గురువారం ఆవిష్కరించారు. విద్యార్థులు పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించేందుకు వీలుగా అనుభజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా 25 ఏళ్లుగా ఈ మోడల్ పేపర్లను రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఎంతో అనుభవం కలిగిన, నైపుణ్యం కలిగిన సబ్జెక్టు ఉపాధ్యాయులు ఈ పుస్తకంలోని పేపర్లు రాశారని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుండి మంచి ఆదరణ ఉందన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ వ్యాపార ధోరణితో కాకుండా విద్యారంగ అభివృద్ధికి దోహదపడాలి అనే యుటిఎఫ్ లక్ష్యంతో తక్కువ ధరకు వీటిని విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

వరికపూడిసెల పూర్తయ్యే వరకూ విశ్రమించం


రూ.54.09 కోట్లతో బైపాస్ పనులకు శంకుస్థాపనలో ఎంపీ, ఎమ్మెల్యే

▶ 4లో



తిరుమల పవిత్రతను కాపాడుతాం

అమరావతి వేంకటేశ్వరుని ఆలయం అభివృద్ధికి సిఎం శంకుస్థాపన



తన్మయ్ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలో పట్టనంలో నూతనంగా ఏర్పాటు చేసిన తన్మయ్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి మహా నగరాలకు దీటుగా నరసరావుపేటలో అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. తన్మయ్ హాస్పిటల్ ద్వారా పల్నాడు ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ నర్రా ప్రసాద్ బాబు, డాక్టర్ నర్రా తన్మయ్ వీరవల్లిని ప్రత్యేకంగా అభినందించారు.



జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు వశిష్ట జూనియర్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తుళ్లూరు మండలం మదడంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగిన అండర్-16, 18 పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వశిష్ట జూనియర్ కళాశాల డైరెక్టర్ మద్దుల నరేష్ కుమార్ తెలిపారు. అండర్-18లో జక్కుల దేవ ప్రసన్న కుమార్, అండర్-16లో ఎం.శశికుమార్ వచ్చే నెల 2న ఒడిశాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. వీరిని కళాశాల చైర్మన్‌లు మద్దుల కోటేశ్వరరావు, నర్రా శేషగిరిరావు, డైరెక్టర్లు నల్లపాటి శ్రీకాంత్, భవిరిశెట్టి మదన రాజారావు, ప్రిన్సిపల్ శివనాగేశ్వరరావు, పీడీ వై.సురేష్, అధ్యాపకులు అభినందించారు.

సౌత్‌జోన్ స్విమ్మింగ్ పోటీలకు శివసాకేత్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా




36వ సౌత్ జోన్ జాతీయ స్విమ్మింగ్ పోటీలకు స్థానిక శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి కె.శివ సాకేత్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్ సుధీర్ గురువారం తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన 10వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లాల శీతాకాలపు స్విమ్మింగ్ ఛాంపియన్షిప్-2025 పోటీల్లో 200 మీటర్లు బటర్ ఫ్లై విభాగంలో శివసాకేత్ ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకం సాధించినట్లు తెలిపారు. డిసెంబర్ 21, 22, 23 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో జరిగే పోటీల్లో పాల్గొనే శివసాకేత్ అక్కడ రాణించాలని ఆకాంక్షించారు. శివ సాకేత్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రెటరీ - కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూదనరావు, అధ్యాపకులు అభినందించారు.

ఉన్నట్టుండి ఇళ్లు ఖాళీ చేయాలని హుకుం

ఆందోళనలో కెఎల్ రావు కాలనీ పేదలు

ప్రజాశక్తి- తాడేపల్లి





పట్టణంలోని కెఎల్ రావు కాలనీ పేదల ఇళ్లకు అధికారులు సిద్ధమయ్యారు. రాజధాని అమరావతికి సీడ్ ఎక్స్ప్రెస్ రోడ్డు కనెక్టివిటీ కోసం, కొండవీటి వాగు హెడ్ స్లూయిస్ సమీపంలో నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి కోసం ఇక్కడ 86 మంది పేదల ఇళ్ల తొలగింపునకు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా సచివాలయ ఉద్యోగులు గురువారం ఆ ప్రాంతానికి వెళ్లి ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలంటూ ఆదేశించడంతోపాటు మార్కింగ్ ఇచ్చారు. తమకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలని పేదలు గతంలోనే నిరసన తెలపగా ప్రకాష్ నగర్‌లోని తెల్ల క్వారీ వద్ద, ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రం సమీపంలో కొంతమందికి, ఆత్మకూరులోని జగనన్న కాలనీలో మరి కొంతమందికి లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయించారు. కొంత నష్టపరిహారం కూడా చెల్లించారు. చిన్నపాటి రేకుల షెడ్డుకు రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. అయితే లాటరీ పద్ధతిలో కేటాయించిన ప్లాట్లకు సంబంధంచి పట్టాలివ్వలేదని బాధితులు చెబుతున్నారు. పట్టాలివ్వకుండా ఇళ్లను ఖాళీ చేయాలనడం ఏమిటని వాపోతున్నారు. తాము కొత్తగా ఇల్లు నిర్మించుకోవాలంటే ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారానికి పదింతలు ఖర్చు పెట్టాల్సి ఉంటుందంటున్నారు. తాజాగా ఇళ్ల తొలగింపునకు మార్కింగ్ నేపథ్యంలో సిపిఎం నాయకులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉన్నపళంగా ఖాళీ చేయాలంటే పేదలు ఎక్కడికి వెళ్తారని, వారికి కేటాయించిన ప్లాట్లకు సంబంధించి పట్టాలిచ్చే వరకూ ఇక్కడే ఉండనివ్వాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన పరిహారం ఇళ్ల పునాదులకైనా సరిపోదని, దీన్ని పెంచాలని డిమాండ్ చేశారు.

సిపిఎం సీనియర్ సభ్యులు చింతపల్లి కోటేశ్వరరావు మృతి





నివాళులర్పింస్తున్న గుంటూరు విజయ్‌కుమార్.. కోటేశ్వరరావు (ఫైల్)

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని మాదల గ్రామానికి చెందిన సిపిఎం సభ్యులు చింతపల్లి కోటేశ్వరరావు (72) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్‌తోపాటు ఆ పార్టీ శ్రేణులు సందర్శించి నివాళులర్పించారు. భౌతికాయాంపై సిపిఎం జెండాను విజయ్‌కుమార్ కప్పి జోహార్లు అర్పించారు. అంత్య క్రియలు శుక్రవారం ఉదయం మాదలలోనే నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు. భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్న కోటేశ్వరరావు వ్యవసాయ కార్మికుడిగా, బస్ క్లీనర్‌గా, ఫ్యాక్టరీ కార్మికుడుగా, అసంఘటితరంగ కార్మికుడిగా తన జీవితాన్ని సాగించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పేదరికం, కష్టాలు ఎదురైనా, ఎన్ని ఆటుపోట్లు వచ్చినా సిపిఎం సిద్ధాంతానికి కట్టుబడి పని చేశారని, పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాలనూ జయప్రదం చేయడం కోసం శక్తివంచన లేకుండా కృషి చేశారని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మికుల సంఘం కార్యకర్తగా, సిపిఎం పార్టీ సభ్యునిగా కడవరకు పనిచేశారని, మాదల గ్రామంలో జరిగిన పార్టీ అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కార్యదర్శిగా, సత్తెనపల్లి పాత తాలూకా కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. నివాళు లర్పించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి జి.బాలకృష్ణ, సత్తెనపల్లి పట్టణ, రూరల్ కార్యదర్శులు డి.విమల, పి.మహేష్, నాయకులు ఎం.హరిపోతురాజు, ఎం.వెంకటరెడ్డి, కె.నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వర్లు, ఐ.వెంకటరెడ్డి, జె.బాబురావు ఉన్నారు.

రైతన్నా మీకోసం.. ఒక పెద్ద డ్రామా షో : వైసిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



కూటమి ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం పెద్ద డ్రామా షో అని వైసిపి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నరసరావుపేటలోని వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏ పంటకూ మద్దతు ధరల్లేక రైతులు అల్లాడుతున్నారని, అరటి, మామిడి పంటలను కొనేవారు లేక రోడ్ల మీద పడేసే దుస్థితి నెలకొందని అన్నారు. గతంలో మొక్కజొన్నను రూ.2,200 కొంటే ఇప్పుడు రూ.1600తో సరిపెడుతున్నారని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు కేంద్రంతో పని లేకుండా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికలప్పుడు హామీనిచ్చి ఇప్పుడు రెండు విడతలుగా రూ.10 వేలతో సరిపెట్టారని విమర్శించారు. మొంథా తుపాను వల్ల 55 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, జిల్లా వ్యవసాయాధికారి నమోదు చేయగా లాం వ్యవసాయ శాస్త్రవేత్తలతో పరిశీలన చేయించి 7500 ఎకరాల్లోనే నష్టం జరిగిందంటూ రూ.10 వేల పరిహారం ఇస్తున్నారని అన్నారు. పైగా ఇప్పుడు రైతన్న కోసమంటూ ప్రచారం చేస్తున్నారని ఎద్దేవ చేశారు. నరసరావుపేట మార్కెట్ యార్డులో సిసిఐ కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు అన్నారు. పొగాకు పంట అమ్ముకున్న రైతులకు నగదు జమైన సందర్భంగా గురువారం ఆయన స్థానిక టిడిపి కార్యాలయం వద్ద మాట్లాడారు. పొగాకుకు మద్దతు ధరలేక రైతులు ఇబ్బందులు పడుతుండగా ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, ఏలూరు సాంబశివరావు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వంటి వారు సిఎం దృష్టికి తీసుకెళ్లారని, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొన్నారని చెప్పారు. రైతుల ఖాతాల్లో ప్రస్తుతం జమైన నగదు సాగులో పెట్టుబడులకు ఉపయోగపడుతుందని టిడిపి మండల కన్వీనర్ గింజుపల్లి శివరాంప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో మల్లయపాలెం సొసైటీ ప్రసిడెంట్ కుర్రి సుబ్బారెడ్డి, సదాశివరావు, భాగ్యారావు, రైతులు పాల్గొన్నారు.



మాక్ అసెంబ్లీలో అదరగొట్టిన కాత్యాయని

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులతో రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో నరసరావుపేట మండలం కాకాని జెడ్‌పి పాఠశాల పదో తరగతి విద్యార్థిని వక్కలగడ్డ కాత్యాయని హాజరై ఉత్తమ ప్రతిభ పురస్కారాన్ని స్వీకరించింది. మాక్ అసెంబ్లీలో గృహ నిర్మాణ, పారిశ్రామిక, ప్రజా సంబంధాల శాఖ మంత్రి పాత్ర పోషించిన కాత్యాయనిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం అభినందించారు. విద్యార్థిని నాయకత్వ లక్షణాలు, వాదనా సామర్థ్యం భవిష్యత్తులో మంచి నాయకురాలిగా ఎదగడానికి ఉపయోగపడతాయని అన్నారు.

నరసరావుపేట మండలం ఇక్కుర్రు గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై మాట్లాడారు. గ్రామంలో 780 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ది చేకూరిందన్నారు.

రాజధాని విస్తరణకు సిఎం మొగ్గు

(మొదటి పేజీ తరువాయి)

తాడికొండ, పెదకూరపాడు ఎమ్మెల్యేల వద్ద గ్రామ సభల్లోనే ఈ అంశాలను ప్రస్తావించారు. 2015లో రాజధాని గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల్లో కూడా ఎకరం రూ.10 లక్షల నుంచి 30 లక్షలు ఉండగా ఇప్పుడు రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు పెరిగింది. దీంతో ప్రస్తుతం రాజధానికి భూములు ఇవ్వడానికి రైతులు వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వానికి భూమి ఇచ్చి ప్యాకేజి కింద ఇచ్చే 1250 గజాల స్థలం తీసుకోవడం కంటే తాము ఎకరం అమ్ముకుంటే ఎక్కువ సొమ్ము వస్తుందనే భావన రైతుల్లో కన్పిస్తుంది. ఇదిలా ఉండగా మరో విడత సమీకరణ జరిగితే 29 గ్రామాలలో భూముల ధరలు తగ్గుతాయని సమీకరణలో భూములు ఇచ్చిన రైతులు వాదిస్తున్నారు. తాము ఆశించిన ధరలు రావడం లేదని ఇప్పటికే రాజధానిరైతులు అసంతృప్తిగా ఉన్నారు. అయితే గత నాలుగు నెలలుగా మలివిడత సమీకరణపై ప్రతిష్టంభన నెలకొనగా తాజాగా సిఎం చంద్రబాబు రాజధాని విస్తరణ చేయాలని రైతులతో నేరుగా చెప్పడంతో భూ సమీకరణకు త్వరలో నోటిఫికేషన్లు రానున్నాయని తెలుస్తోంది.

ఆత్మకూరులో ఎన్టీఆర్, ఎంఎస్ఎస్ విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరు సెంటర్ లో ఏర్పాటుచేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు, మాజీ మంత్రి స్వర్గీయ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు విగ్రహాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ముందుగా ఆత్మకూరు సెంటర్ కు చేరుకున్న మంత్రి లోకేష్ కు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్, ఎంఎస్ఎస్ విగ్రహాలను మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ఈ వేడుకకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, కనికళ్ల చిరంజీవి ఏపిఐఐసి డైరెక్టర్, గ్రామ అధ్యక్షులు తాటి వెంకట్రావు, మండల టీడీపీ ఉపాధ్యక్షులు కొమ్మా సుకుమార్, మాదాల సునీల, నన్నపనేని నాగేశ్వరరావు, కొమ్మా లవ్ కుమార్, టి.ఏసు రత్నం, టి.ఏసుదాస్, టి.యేసోబు, టి.పన్నయ్యతో పాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆత్మకూరులో స్వర్గీయ ఎన్టీఆర్, ఎంఎస్ఎస్ విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం గ్రామంలోని శ్రీ గంగానమ్మ తల్లి దేవాలయాన్ని మంత్రి నారా లోకేశ్ సందర్శించారు.



ఎస్ఆర్ఎంలో అధునాతన హాస్పిటల్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో అధునాతన సౌకర్యాలతో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ సెంటర్ (ఆస్పత్రి)ను గురువారం వైస్ ఛాన్సలర్ ఆచార్య సిహెచ్ సతీష్ కుమార్ ప్రారంభించారు. విద్యార్థులు, ప్రొఫెసర్లు ఉద్యోగులకు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఐదుగురు వైద్యులను ఏర్పాటు చేశారు. పీడియాట్రీషియన్‌తో పాటు ఐదుగురు వైద్యులు నిత్యం అందుబాటులో వైద్య సేవలు అందించనున్నారని వైస్ ఛాన్సలర్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఏడుగురు శిక్షణ పొందిన నర్సింగ్ ఉద్యోగులు కూడా అత్యవసర వైద్య సేవలను అందించనున్నారని పేర్కొన్నారు ఇప్పటివరకు రెండు పడకల ఆసుపత్రిగా ఉన్న మెడికల్ సెంటర్ ను ఎనిమిది పడకల ఆసుపత్రిగా విస్తరించినట్లు పేర్కొన్నారు సాధ్యమైనంత మేరకు యూనివర్సిటీ ఆసుపత్రిలోనే అన్ని రకాల వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఉన్నామని వైద్యులు పేర్కొన్నారు ఎక్స్ రే, స్కానింగ్లు, స్పెషలిస్టుల వైద్య పరీక్షల కోసం ఎయిమ్స్ ఎన్నారై ఆస్పత్రుల సహకారం తీసుకుంటామని వైద్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్ కుమార్, స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ గురుప్రీత్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జెఎంజె కళాశాలలో అవగాహన

ప్రజాశక్తి తెనాలి : స్థానిక జె యం జె మహిళా కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.కె నిషార్ భాషా మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకు వ్యక్తిగత ఖాతాల వివరాలు అపరిచితులతో పంచుకోకూడదన్నారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని, అలాగే సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం రూపొందించబడిన వెబ్సైట్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలన్నారు. ఫోన్ పే, గూగుల్ పే వంటి వాటికి కేవైసీ కోసం అంటూ వచ్చే మెసేజ్ లపై స్పందించకూడదని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజ కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపాల్ డా సిస్టర్ రోజ్లిన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దాసరి విజయలక్ష్మి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ కె అరుణ సుజాత, విద్యార్థినులు పాల్గొన్నారు.

దుకాణాల వివాదం.. పరస్పరం దాడులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పాత కక్షలు నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన పట్టణంలోని ఆడితిల సెంటర్ నందు గురువారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం పిడుగురాళ్ల పట్టణానికి చెందిన సైదా మరియు మాబు వలీలు చికెన్ దుకాణాలు నిర్వహిస్తూ ఉండేవారని ఇరువురు మధ్య గతంలో చికెన్ దుకాణాలకు సంబంధించి వివాదాలు ఉండేవని ఈ క్రమంలోనే బాబు వలి అతని సమీప బంధువైన మాచవరం మండలం తురకపాలెం గ్రామానికి చెందిన హుస్సేన్ తో కలిసి గురువారం సైదా దుకాణం వద్దకు వెళ్లి గొడవ పడటంతో గొడవ పెద్దదై ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారని తెలిపారు. దాడిలో ఇరువర్గాలకి గాయాలయ్యాయని స్థానికులు సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారిని స్థానిక ప్రైవేటు వైద్యశాలలకు తరలించినట్లు తెలిపారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఆయన తెలియజేశారు.

వాలీబాలో టోర్నీ విజేత కృష్ణవేణి డిగ్రీ కాలేజీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎఎన్‌యు అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల నిలిచింది. చివరి రోజైన గురువారం కృష్ణవేణి డిగ్రీ కళాశాల, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. కృష్ణవేణి కాలేజీ జట్టును విజయం వరించగా రెండో స్థానంలో వర్సిటీ జట్టు, మూడో స్థానంలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నిలిచాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వరావు, యూనివర్సిటీ యోగా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ బి.సూర్యనారాయణరావు, కాలేజీ డైరెక్టర్ నాసరయ్య, డాక్టర్ సిహెచ్.వెంకట్రావు, డాక్టర్ గౌరీశంకర్, డాక్టర్ పి.శ్రీనివాసరావు, అబ్బయ్య చౌదరి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సతీష్ బాబు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిబాబు, మహమ్మద్ పాల్గొన్నారు.





భూ సమస్యను పరిష్కరించకుంటే కోర్టుకు..

ప్రజాశక్తి - అచ్చంపేట

చెరుకుపాలెం గ్రామం తాళ్ళచెరువు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలిసి సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్ గురువారం పరిశీలించారు. ఈ క్రమంలో బాధితుల తరపున రైతుసంఘం నాయకులు ఆర్డీవోతో మాట్లాడుతూ తాళ్లచెరువు రెవెన్యూలోని 321 సర్వే నంబర్‌లోని భూములకు చెందిన రైతులు రెండేళ్ళుగా అన్ని కార్యాలయాలు చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదని, భూములు తమవేనంటూ ఆధారాలన్నీ చూపుతున్నా అటవీ శాఖాధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించుకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఆర్‌డిఓ స్పందిస్తూ రికార్డులను పరిశీలించారు. మంగళగిరి నుండి ఫీల్డ్ మ్యాప్ తీసుకు రావాలని డిఆర్‌ఓ కుసుమకుమారి, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఆర్.వెంకటేశ్వర్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కెకె.రెడ్డి, రైతులు సుంకర భానురావు, కొంపెర్ల స్వామి, కత్తులు నాగరాజు పాల్గొన్నారు.




ఖోఖో జాతీయస్థాయి పోటీలకు గీతమ్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - వినుకొండ : స్థానిక సిద్ధార్థ నగర్‌లోని గీతమ్స్ హైస్కూల్ విద్యార్థులు మారెళ్ల అభినాష్‌రెడ్డి, నక్క సాయిచరణ్ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి మాట్లాడుతూ ఈనెల నవంబర్ 22, 23, 24 తేదీల్లో కాకినాడలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రతిభ చూపారని, డిసెంబర్ 24న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. అక్కడ ఉత్తమ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. తమ పాఠశాలలో విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తూ శిక్షణిప్పిస్తున్నామని, మానసిక ఒత్తిడిని అధిగమించాలంటే ఆటలు ఎంతో ముఖ్యమని అన్నారు.

137 మంది 'న్యూటన్స్' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - దుర్గి

మాచర్లలోని న్యూటన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఇంటర్వ్యూలో 137 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జొన్న శ్రీనివాసరెడ్డి తెలిపారు. ష్నైడర్ ఎలక్ట్రికల్, అశోక్ లైలాండ్, టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీలు ఎంపిక చేపట్టాయని, 76 మంది బీటెక్, 61 మంది (ఈసీఈ, సిఎస్‌ఈ) నుండి ఉద్యోగాలు సాధించారని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన వారిని జున్న శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ జగదీశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతిజ్ఞ



ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రకాష్ నగర్‌లోని షాదిఖానాలో పల్నాడు జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల ముక్త భారత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా మహిళా-శిశు సంక్షేమ సాధికారిత అధికారి ఉమారాణి మాట్లాడుతూ బాల్య వివాహం వల్ల కలిగే దుష్పరిణామాలు, ప్రోహిబిషన్ అఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ (పిసిఎంఎ) 2006 చట్టం గురించి వివరించారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు రాక ముందు వివాహం నేరమన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, వివాహానికి హాజరైనా రెండేళ్లు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తారని చెప్పారు. బాల్య వివాహం జరుగుతున్నదన్న సమాచారం తెలిసిన వారు గ్రామ స్థాయిలో గ్రామ కార్యదర్శి, విఆర్‌ఒ, మండల స్థాయిలో సిడిపిఒ, తహశీల్దారు, ఐసిడిఎస్ సూపర్వైజర్ డివిజినల్ స్థాయిలో ఆర్‌డిఒ లేదా సబ్ కలెక్టర్, జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించాలని కోరారు. పల్నాడు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో నరసరావుపేట, రొంపిచర్ల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, మెడికల్ ఆఫీసర్లు, మిషన్ శక్తి కో-ఆర్డినేటర్, బాలల పరిరక్షణ విభాగం, వన్‌స్టాప్ సెంటర్, ఐసిడియస్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ సత్తిరాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతోపాటు ఒక శిశువు భవిష్యత్తును దెబ్బ తీస్తాయని చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ మేరకు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎఆర్ డిఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ ఎల్.గోపీనాథ్, అడ్మిన్ ఆర్ఐ ఎస్.కృష్ణ, ఎమ్‌టి ఆర్ఐ యువరాజు పాల్గొన్నారు.

వరికపూడిసెల పూర్తయ్యే వరకూ విశ్రమించం

రూ.54.09 కోట్లతో బైపాస్ పనులకు శంకుస్థాపనలో ఎంపీ, ఎమ్మెల్యే



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల

వరికపూడిసెల ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే వరకూ విశ్రమించేది లేదని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ ప్రధాన ద్వారం ముందు భాగంలో మాచర్ల, రెంటచింతల, గురజాల పట్టణాలకు సంబంధించిన ఇన్నర్ బైపాస్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి ఎంపీ గురువారం శంకుస్థాపన చేశారు. రూ.54.09 కోట్లతో నిర్మించనున్న ఈ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ఎంపి మాట్లాడుతూ వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఉన్నతంగా పుంజుకుంటేనే ఆ ప్రాంతాల అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. పార్లమెంటు పరిధిలో ఇప్పటికే వేల కోట్లతో దాదాపు 231 కిలోమీటర్ల మేరకు నూతన హైవే రోడ్లను నిర్మించినట్లు చెప్పారు. త్వరలో అన్నీ అనుమతులతో వరికపూడిసెలకు శంకుస్థాపన చేస్తామని, అనంతరం పనులనూ పరుగులు పెట్టాస్తామని అన్నారు. నియోజకవర్గ పరిధిలో రూ.1200 కోట్లతో జల్ జీవన్ మిషన్, రూ.124 కోట్లతో అమృత్ పథకాల పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ అరాచకం రాజ్యమేలితే అభివృద్ధి శూన్యమని, ప్రశాంతతను పాడు చేసేందుకే వైసిపి అలజడులు సృష్టిస్తోందని ఆరోపించారు. తెలంగాణ మద్యాన్ని మాచర్లకు తెచ్చి అమ్ముతున్న ఏ ఒక్క వైసిపి అక్రమార్కుణ్ణి కూడా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. పట్టణ చరిత్రలో రూ.54.09 కోట్లతో రోడ్ల విస్తరణ గర్వకారణంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా తెలుగు యువత మాజీ అధ్యక్షులు షేక్ మోసిన్ సామాజిక సేవలను ఎంపీ, ఎమ్మెల్యే ప్రశంసించారు. ఆయన సమకూర్చిన రెండు తోపుడుబండ్లను ఇద్దరు వీధి విక్రేతలకు అందించారు.



పట్టుదలతో శ్రమిస్తే ఉత్తమ ఫలితాలు : డిఇఒ

ప్రజాశక్తి-ఈపూరు

పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే విద్యార్థులు పట్టుదలతో శ్రమించాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. మండలంలోని ఎ.ముప్పాళ్ల, ఈపూరు జెడ్‌పి పాఠశాలలు, కెజిబివి పాఠశాలను డిఇఒ గురువారం తనిఖీ చేశారు. మౌలిక వసతులు, కెమిస్ట్రీ ల్యాబ్‌లను పరిశీలించారు. కెజిబివి పాఠశాలలో వంటగది, భోజనశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. రైజింగ్‌స్టార్స్ తరగతుల బోధనపై వివరాలు అడిగారు. పదో తరగతి విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య మంచి భవిష్యత్తును ఇస్తుందన్నారు. చదువు ఉంటే అన్ని రంగాలలో రాణించవచ్చన్నారు. మంచి ఫలితాలు సాధనకు పలు సూచనలు చేశారు. అనంతరం వనికుంట గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ భవనం, హాస్టల్ భవనాన్ని సందర్శించారు. పరిశీలనలో ఎంఇఒ-2 రామ తులసి ఉన్నారు.

నరసింగపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నకరికల్లు

మండలంలోని నరసింగపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. 17 శాతం తేమతో వున్న 75 కిలోల బస్తాకు రూ.1792 మద్దతు ధర వస్తుందని, ధాన్యం అమ్మిన 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తారని చెప్పారు. పల్నాడు జిల్లాలో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిసెంబర్ నెలాఖరులోపు రోడ్లపై గుంతలు లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో జిడిసిఎంఎస్ చైర్మన్ వి.హరిబాబు, నారదమని, హరగోపాల్, పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు, డిఆర్‌డిఎ పీడీ జ్యోతి, తహశీల్దార్ పుల్లారావు, ఎంపిడిఒ కాశయ్య, ఏవో దేవదాసు, టిడిపి నాయకులు ఎన్.సారయ్య, ఎ.రాజు, నకరికల్లు సొసైటీ ప్రెసిడెంట్ వెంకట్రావు, న్యాయవాది షేక్ అలీబాష పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా పాఠశాల బస్సుల తనిఖీ : ఎస్‌ఎఫ్ఐ



పని చేయని అత్యవసర ధ్వారం

ప్రజాశక్తి-దాచేపల్లి

స్థానిక మార్కెట్ యార్డు వద్ద గురజాల, దాచేపల్లి ప్రైవేటు బస్సులకు సంబంధించిన ఫిట్‌నెస్, ధ్రువ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌ల తనిఖీలు చేపట్టిన అధికారులు మొక్కుబడిగానే చేశారని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్ఐ) దాచేపల్లి కార్యదర్శి విక్రం అన్నారు. బస్సుల్లో అద్దాలు, పగిలినా అత్యవసర ద్వారాలు ఓపెన్ కాకున్నా సరిగా పరిశీలించలేదని అన్నారు. ఎన్ని బస్సులకు ఫిట్‌నెస్ ఉందో, ఎన్ని బస్సులకు అత్యవసర ద్వారాలు పనిచేయడం లేదో అట్టి బస్సులపై ఎన్ని కేసులు నమోదు చేసారో తదితర వివరాలు వెల్లడించాలని కోరారు. కండీషన్లో లేని బస్సుల వల్ల ప్రతిఏటా ప్రమాదాలు జరుగుఉన్నాయని, దీనిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

తుది శ్వాస వరకూ... ఉద్యమం కోసం

సిపిఎం, రైతు సంఘం నాయకులు జానారెడ్డి సంస్మరణ సభలో పి.మధు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న పి మధు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం జిల్లా నాయకులు భీమిరెడ్డి జానారెడ్డి తుది శ్వాస వరకు రైతు, పేద ప్రజలు, గ్రామాభివృద్ధి సిపిఎం అభివృద్ధి కోసం కోసం కృషి చేశాడని, తన 76 సంవత్సరాల జీవితంలో 60 సంవత్సరాలు పార్టీ నిర్మాణం కోసం పనిచేశారని సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి మధు పేర్కొన్నారు. గురువారం మండలంలోని నూతక్కి గ్రామంలో భీమిరెడ్డి జానారెడ్డి సంస్మరణ సభ చీడిపూడి బ్రహ్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సభలో సిపిఎం పి మధు మాట్లాడుతూ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ బలంగా ఉన్న కాలం నుండి నేటి వరకు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేస్తూ వచ్చారన్నారు. జానారెడ్డి చిన్నప్పటినుండి తనకు తెలుసునని విద్యార్థి ఉద్యమంలో పనిచేసే కాలంలో పరిచయం ఉందన్నారు. తను అనారోగ్యంలోను ప్రజా సమస్యల గురించి రైతాంగ సమస్యల గురించి ఎల్లప్పుడూ మాట్లాడుతూ వచ్చారని చెప్పారు. గ్రామాల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని గ్రామానికి సురక్షిత రక్షిత మంచినీరు ఆవశ్యకత ఉందని చివరి రోజుల్లోనూ ఆయన మనసులోని మాటను పేర్కొనడం గ్రామం పట్ల ఆయనకు గల చిత్తశుద్ధిని తెలుపుతుందన్నారు. పై గ్రామాల నుండి అపార్ట్మెంట్ల మురుగునీరు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు లేకపోవడంతో పంట కాలవలను మురుగునీటి కాల్వలుగా మారుస్తున్న క్రమంలో ఆయన రైతుగా ఎంతగానో ఆందోళన చెందారని చెప్పారు. పైనుంచి వస్తున్న మురుగునీరు వలన నూతక్కిలోని గోదారి కలుషితం అవుతున్నదని దీనిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని జానారెడ్డి ఎల్లప్పుడు చెప్పేవారని ఈ క్రమంలో గ్రామ పెద్దలు పార్టీలకు అతీతంగా కలసి రావాలన్నారు. తద్వారా నూతక్కి గ్రామ భవిషత్ కు, అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. విత్తన, పురుగుమందుల కంపెనీలు వారి ప్రయోగాల కోసం నూతక్కి గ్రామ రైతుల పంట భూములపై ప్రయోగాలు చేయడం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దీనిని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి ప్రతి ఒక్కరు అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రయోగాల వలన అనేక నష్టాలు జరుగుతు న్నాయని పేర్కొన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు అన్నపురెడ్డి కోటిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ బలంగా ఉన్న కాలంలో పార్టీలో చేరి నాటి నుండి నేటి వరకు సిపిఎం పార్టీ నిర్మాణానికి కృషి చేశారని చెప్పారు. నిత్యం గ్రామ రైతుల సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన తీరు అందరికీ ఆదర్శనీయమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ కమ్యూనిస్టుగా జానారెడ్డి అందరిలో నిలిచారన్నారు. ఉచిత విద్య వైద్యం నేడు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుందని కానీ మొదటి నుండి అడుగుతున్నది కమ్యూనిస్టులేనని పేర్కొ న్నారు. ధరల పెరిగిన సమయంలో వాటిని అదుపు చేయలేక మోడీ ప్రభుత్వం ధరలను విపరీతంగా పెంచుతున్నారని చెప్పారు. ధరల నియంత్రణ ను పాటించడం లేదన్నారు. జానారెడ్డి స్ఫూర్తితో ప్రజా సమస్యలపై గళమెత్తాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్ మాట్లాడుతూ పసుపు పంట నష్టపరిహారం కోసం రైతులను సమీకరించి ఆందోళన చేసి పరిహారాన్ని రైతులకు ఇప్పించడంలో ఆయన ఎంతగానో పరితపించారన్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ జానారెడ్డి గ్రామ సమస్యలపైనే కాకుండా నియోజకవర్గ స్థాయిలో రైతులను కదిలించి గిట్టుబాటు ధర కోసం ఉద్యమించిన చరిత్ర ఆయనదని అన్నారు. గురజాడ కళా వేదిక ప్రతినిధి చీడిపూడి నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కమ్యూనిస్టు గా నైతిక విలువలు కూడిన వారిని సమీకరించి అనేక పోరాటాలలో భాగస్వాములు చేసే వారిని చెప్పారు. వైసిపి గౌరవ అధ్యక్షులు భీమిరెడ్డి సాంబిరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సమస్యపై నిలిచేవారని జానారెడ్డిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జె వి రాఘవులు, ఎం.పకీరయ్య, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, ఎం భాగ్యరాజు, ఐద్వా నాయకులు డి. శ్రీనివాస కుమారి, డివైఎఫ్ఐ నాయకులు వై సుగుణ కుమార్, నూతక్కి సొసైటీ చైర్మన్ వల్లూరు వెంకటేశ్వరరావు, వల్లూరు భారతి, సిపిఐ నాయకులు ఎస్ కే బాబు, బుర్రముక్కు పిచ్చిరెడ్డి, గ్రామస్తులు, కళ్లం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎ కోటిరెడ్డి



మాట్లాడుతున్న జె శివశంకరరావు



మాట్లాడుతున్న పి బాలకృష్ణ



మాట్లాడుతున్న డి శ్రీనివాసకుమారి



సభలో మాట్లాడుతున్న వై నేతాజీ

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ అమలు చేస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) గుంటూరు జిల్లా అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాల రావులు డిమాండ్ చేశారు. గురువారం గుంటూరు నగరపాలక సంస్థ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద లేబర్ కోడ్స్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను హరించే విధంగా బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత లేబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్స్ కార్మికులకు అనుకూలమని అబద్ధపు ప్రచారం చేస్తుందని విమర్శించారు. కార్మికులకు సమ్మె చేసే హక్కు, యూనియన్ పెట్టుకునే హక్కు లేకుండా చేసే విధంగా ఈ లేబర్ కోడ్స్ ను రూపొందించారన్నారు. ఫిక్స్డ్‌టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో కార్మికులకు ఉపాధి భద్రత లేకుండా చేసేందుకే ఈ లేబర్ కోడ్స్ తెచ్చారని అన్నారు. ఈలేబర్ కోడ్స్ యాజమాన్యాలకి అనుకూలం తప్ప కార్మికులకు కాదని అన్నారు. పెట్టుబడిదారుల కోరిక మేరకు 8 గంటల పని విధాన బదులు 10, 13 గంటల పని విధానం తీసుకొచ్చారని, ఇప్పటికే మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, రాత్రి వేళలో మహిళలతో పని చేయించుకోవచ్చని చట్టం చేయడం ద్వారా మహిళలపై ఇంకా అఘాయిత్యాలు పెరిగే అవకాశం ఉందని అన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన ఈ లేబర్ కోడ్స్ రద్దుకై భవిష్యత్తులో జరిగే పోరాటాలలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాసిర్ ఖాన్, బాషా, షమ్మీ, వెంకటేశ్వరరావు, సలాం, సిహెచ్ అజిల్, తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న కార్మికులు

సర్వే నంబరు 774లోని భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మండలం నవులూరు శివారు యర్రబాలెంలోని సర్వే నెంబరు 774 లోని భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ కు అసైన్డ్ భూ బాధితులు విన్నవించారు. గురువారం నగరంలోని గ్రంథాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి లోకేష్ ను పలువురు అసైన్డ్ భూ బాధితులు కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబర్ 774 లోని నివేసిన స్థలాలను 1982వ సంవత్సరంలో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేయించుకుని నివాస గృహాలను నిర్మించుకున్నట్లు తెలిపారు. సి ఆర్ డి ఏ మాస్టర్ ప్లాన్ లో సర్వేనెంబర్ 774 లో భూములు ఆర్ ఒన్ జూన్లో నమోదు అయినందున సదరు భూమిని నిషేధిత భూముల జాబితా నుండి తొలగించాలని అసైన్డ్ బాధితులు మంత్రి లోకేష్ ను కోరారు. సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రూ.1.72 కోట్ల వ్యయంతో మోడల్ లైబ్రరీ

మంగళగిరిలో ప్రారంభించిన మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణం శివాలయం వద్ద రూ.1.72 కోట్లతో ఆధునీకరించిన మోడల్ పబ్లిక్ లైబ్రరీని గురువారం మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. 1986లో ముఖ్యమంత్రి హోదాలో స్వర్గీయ ఎన్టీఆర్, మాజీ మంత్రి స్వర్గీయ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం పేరుతో మంగళగిరిలో లైబ్రరీకి శంకుస్థాపన చేశారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో మంత్రి నారా లోకేష్ చొరవతో లైబ్రరీని ఆధునీకరించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. లైబ్రరీ ఆధునీకరణకు సీఎస్ఆర్ ఫండ్స్ కింద గుంటూరు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ రూ.90 లక్షలు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఫండ్స్ రూ.42 లక్షలు, నోవో ఇన్సూరెన్స్ బ్రేకింగ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.30 లక్షలు అందించారు. లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్ లో పిల్లల కోసం రీడింగ్ రూమ్, ప్లే ఏరియా, వివిధ దిన పత్రికలు, వార, మాసపత్రికలు అందుబాటులో వుండేవిధంగా రూమ్, బుక్ రీడింగ్ రూమ్, సీనియర్ సిటిజన్స్ రీడింగ్ ఏరియా, పబ్లిక్ రీడింగ్ ఏరియా, ఫలహారశాలతో పాటు మొదటి అంతస్తులో రెండు టీచింగ్ హాల్స్, స్టడీ రూమ్, నైపుణ్యంతో పాటు పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే



వారికోసం రీడింగ్ ఏరియా, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ రీసోర్స్ సెంటర్ ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌శిలాఫలకం వద్ద లోకేష్ సెల్ఫీ దిగారు. అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం కొండపనేని టౌన్‌షిప్ పార్కును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్ ఎస్ రాజశేఖర్, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు,



మంగళగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారికి నోటీస్ అందజేస్తున్న యూనియన్ నాయకులు

12న కలెక్టరరేట్ వద్ద నిరసన

ప్రాజెక్టు అధికారికి యూనియన్ నాయకుల వినతి

ప్రజాశక్తి మంగళగిరి

అంగన్వాడి టీచర్లకు, ఆయాలకు ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ డిసెంబర్ 12వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమానికి సంబంధించిన నోటీసును గురువారం మంగళగిరి ప్రాజెక్టు అధికారికి యూనియన్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. వేతనాలు పెంచుతామని చెప్పి పెంచకపోగా అదనపు పని భారాన్ని పెంచారని అన్నారు. కొత్తగా సెల్ ఫోన్ నుండి వెంటనే ఇస్తామని చెప్పి మాట తప్పిన ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని కోరారు. మంగళగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అంగన్వాడీలు నిరసనలో పాల్గొనేందుకు నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు సుహాసిని, కే హేమలత, రుక్మిణి, సరళ, జయశ్రీ, ఆర్ వి ఎస్ కుమారి, సరస్వతి పాల్గొన్నారు.



మందడం సెంటర్లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం రాజధాని నేతలు

అమరావతికి సాయం.. మాటల్లో కాదు చేతల్లో చూపాలి : సిపిఎం

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి నిర్మాణానికి సాయం చేస్తామంటూ మాటలు చెప్పడం కాకుండా చేతల్లో చూపించాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజధాని అమరావతిలో పలు బ్యాంకుల శంకుస్థాపనకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం నాయకులు అమరావతి నిర్మాణానికి నిధులు అందజేత, ఇతర అంశాలపై సహకరిస్తామని సీతారామన్ స్పష్టం చేయాలంటూ మందడంలో గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. ఎ డి బి, ప్రపంచ బ్యాంకు రాజధాని అమరావతి నిర్మాణానికి ఇచ్చిన అప్పును కేంద్ర ప్రభుత్వమే భరించి రాజధాని నిర్మాణానికి గ్రాంటుగా ఇవ్వాలని కోరారు. ఇప్పటికే అప్పుల ఆంధ్ర ప్రదేశ్ గా మారుతున్న రాష్ట్రానికి ప్రపంచ బ్యాంకు అప్పు భారమై రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి దించుతుందని అన్నారు. రాజధాని అమరావతి అని పార్లమెంటు సమావేశాల్లో చట్టం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాలకు రాజధాని అమరావతిలో స్థలాలు కేటాయించి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు నిర్మాణ పనులు ప్రారంభించలేదని, వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి ,ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. మంత్రి నిర్మలా సీతారామన్ పై రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావాలని రవి కోరారు.కార్యక్రమంలో సిపిఎం రాజధాని నాయకులు షేక్ జానీ,ధనసిరి రామారావు, ఎస్.కె హుస్సేన్, నాగూర్ జాన్, సైదా తదితరులు పాల్గొన్నారు.

హస్నాబాద్ తండాలో పోలీసుల కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - విజయపురిసౌత్





మాచర్ల మండలం హస్నాబాద్‌తండాలో పోలీస్, ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు గ్రామంలో క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. సరైన పత్రాలు లేని 23 బైకులను, ఇళ్లలో దాచి ఉంచిన 16 గొడ్డళ్లు, 14 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊట పోలీసులు ధ్వంసం చేసినట్లు మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా తెలిపారు. అనంతరం ఎక్సైజ్ కేసుల్లో ఉన్న ఇద్దరు పాత నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో మాచర్ల పట్టణ సిఐ వెంకటరమణ, మాచర్ల ఎక్సైజ్ సీఐ ఎస్.వెంకట రమణ, విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్, ట్రైనీ ఎస్ఐ రాంబాబు, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు, స్వాధీనంచేసుకున్న కత్తులు, బైక్‌లు



మిరప పంటన పరిశీలిస్తున్న అమలకుమారి

మిరప పంటను పరిశీలించిన ప్రాజెక్ట్ మేనేజర్

ప్రజాశక్తి - పెదకూరపాడు

అభ్యుదయ రైతు అవార్డు గ్రహీత డి.శేషారావు ప్రకృతి వ్యవసాయంలో సాగవుతున్న మిరప పంటలను పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి గురువారం పరిశీలించారు. పంటకు వాడుతున్న కషాయాలను అడిగి తెలుసుకున్నారు. వాటి ఖర్చులు వివరాలను అడిగారు. రసం పీల్చే పురుగుల నుంచి తట్టుకుందని ఆమె తెలిపారు. మిరప పొలాల్లో అంతర పంటలు వేసుకోవడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. శేషారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల ఖర్చులు తగ్గి ఆదాయం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో మధుబాబు, అమూల్య, మహబూబ్‌బి పాల్గొన్నారు.

వైకుంఠపురం - అమరావతి రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

ప్రజాశక్తి - అమరావతి

పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కృషితో వైకుంఠపురం నుండి అమరావతి వరకు రోడ్డు నిర్మాణానికి 6 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. నూతన రోడ్డు నిర్మాణంతో రాజధాని నుండి పెదకూరపాడు నియోజకవర్గం లోని అమరావతికి రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా కృషి చేస్తామన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. ఎన్నో ఏళ్ల రోడ్డు సమస్యను పరిష్కారం కావడంతో ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకింగ్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మండలంలోని త్యాళ్ళూరు పిఎంశ్రీ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు స్థానిక యూనియన్ బ్యాంకును గురువారం సందర్శించారు. బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన అనేక అంశాలను, వాటి పని తీరును పరిశీలించారు. వివిధ లావాదేవీలకు సంబందించిన పలు విషయాలపై విద్యార్థులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది నగదు లావాదేవీలు ఎలా చేయాలి, బ్యాంకు రుణాలు ఎలా మంజూరు చేస్తారు, సైబర్ సెక్యూరిటీ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మేనేజర్ అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు ఖానిదా, సునీత, వ్యాయామ ఉపాధ్యాయుడు చెన్నకేశవ స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆయేషా సుల్తానాను అభినందిస్తున్న జేసీ సూరజ్

మాక్ అసెంబ్లీ స్కిట్‌కు అభినందనలు

ప్రజాశక్తి - దుర్గి

జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా కలెక్టరేట్లో మాక్ అసెంబ్లీ స్కిట్ ను నిర్వహించినందుకు డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్, మాచర్లకు చెందిన షేక్ అయేషా సుల్తానాను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డిఇఓ చంద్రకళ, డి.అర్.ఓ.మురళిలు గురువారం అభినందించారు. గవర్నర్, స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రి, ఐటీ అండ్ హెచ్ ఆర్ డి మినిస్టర్, అగ్రికల్చర్ మినిస్టర్, ప్రతిపక్ష నాయకుడు, ఎమ్మెల్యేలు మొదలగు పాత్రలు విద్యార్థులకు ట్రైనింగ్ ఇచ్చి ప్రోత్సహించి నందుకు ఈ గౌరవం దక్కిందని తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ నాయకులుగా ఎదగాలని, మంచి పాలన అందించాలని సూచించారు.

గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ప్రజాశక్తి - అచ్చంపేట

నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను దశలవారీగా అభివృద్ధి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. 100 రోజులు 100 గ్రామాల కార్యక్రమంలో భాగంగా గురువారం అచ్చంపేట మండలం కస్తలగ్రామంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజా . సమస్యలపై పలు రకాల అర్జీలు తీసుకున్నారు. గ్రామానికి చెందిన కంఠమనేని లక్ష్మీనారాయణ 1995లో నుండి వికలాంగుల పింఛన్ పొందుతున్నానని, 90 శాతం వైకల్యంతో ఉన్న పింఛన్ తొలగించారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా గత ఏడు సంవత్సరాలుగా కస్తల గ్రామంలో కఅష్ణా నది ఒడ్డున ఇసుక కార్మికులు జీవనోపాధి పొందే పనులు లేక పడవలో మరమ్మతులు గురయ్యాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా దర్బార్లో 44 అర్జీలు రాగా అందులో 10 గ్రామ అభివృద్ధికి, ఐదు రెవెన్యూ సమస్యలు, తల్లికి వందనం అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అందలేదని ప్రజలు ఎమ్మెల్యేకు అర్జీలు ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ సమస్యలు పూర్తయ్యేంతవరకు గ్రామాల్లోనే కాకుండా మండలంలో కూడా ప్రజాదర్బార్ నిర్వహించి ప్రతి ఒక్క సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయాలను, పాఠశాలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో అర్జీలు తీసుకుంటున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

మహిళల హక్కులు, చట్టాలపై విద్యార్థినులకు అవగాహన



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక వేదా కాలేజీ జిఎన్ఎమ్ /పారా మెడికల్ విద్యార్థినిలకు బాలికలు, మహిళలు హక్కులు చట్టాలు అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న ఆడపిల్లలు నైతికంగా, ఆధ్యాత్మికంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, ప్రతి రంగంలో మహిళలు అగ్రస్థానంలో సేవలం దిస్తున్నారని, అయినా వారిపై వివక్ష, హింస, అఘాయిత్యాలు జరగటం బాధాకరమన్నారు. ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీలత మాట్లాడుతూ మహిళలు బాలికల భద్రతకు రక్షణకు అనేక కఠిన చట్టాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, కళాశాల ప్రిన్సిపల్ మాలతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, టీచర్ మస్తాన్, ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. తొలుత జ్యోతిబా పూలే వర్థంతిలో భాగంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కులు, విధులు కల్పించిన రాజ్యాంగం

ప్రజాశక్తి - దుర్గి

ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కులు, విధులు రాజ్యాంగం కల్పించదని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ అయ్యపరెడ్డి హరిణి తెలిపారు. మాచర్ల పట్టణానికి చెందిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు గురువారం ఇండియన్ కాన్సిట్యూషన్ డ్రైవ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ అయ్యపరెడ్డి హరిణి మాట్లాడుతూ 1976 నాటి 42వ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగంలో ఒక కొత్త భాగం (4ఏ) చేర్చబడిందని, (51-ఏ) , ఇది పౌరులకు పది ప్రాథమిక విధుల నియమావళిని వివరిస్తుందన్నారు. 2002లో పదకొండవ విధిని చేర్చారన్నారు. ఈ విధులు పౌరులు తమ ప్రాథమిక హక్కులతో పాటు ప్రజాస్వామ్య ప్రవర్తన యొక్క ప్రాథమిక నిబంధనలను పాటించాలని గుర్తు చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మీ, బత్తిన హారిక తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న శ్రీచైతన్య విద్యార్థులు

నిత్యావసర సరుకులు అందించిన నారాయణ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - దుర్గి

మాచర్ల పట్టణంలోని నారాయణ స్కూల్ విద్యార్థులు దుర్గి మండలం ఆత్మకూరు గ్రామంలోని వృద్ధాశ్రమం, మండాడి రోడ్డులోని స్వామి వివేకానంద సేవాశ్రమం, శ్రీనివాస మహల్ ప్రక్కన ఉన్న ఆశ్రమంలో నిత్యావసర సరుకులను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ ఉల్లారెడ్డి, స్వామి వివేకానంద సేవాశ్రమం అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ చిన్నారుల చిన్నతనం నుంచే ఈ విధమైన సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ విధంగా మిగిలిన విద్యార్థులు కూడా వారికి తోచిన విధంగా పేదలకు సహాయసహకారాలు అందించడం ద్వారా సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరులుగా తయారు అవుతారు అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీయం జానకి రామిరెడ్డి, కోఆర్డినేటర్స్ భద్రారెడ్డి, గౌసియ, రిహాన, ఇన్‌చార్జిలు ఆంజనేయులు, ఉదయలక్ష్మి, రాజేశ్వరి, విజయలత, పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవీంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రయ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టైఫాయిట్ టీకాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రోటరీ క్లబ్ పండరిపురం, బయోమెడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో టైఫాయిడ్ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ప్రసన్న లక్ష్మీ విద్యాలయంలో క్లబ్ అధ్యక్షులు బోనం వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడరన్ స్టెల్లార్, కృష్ణవేణి ఐఐటి తదితర పాఠశాలల్లో విద్యార్థులకు టైఫాయిడ్ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుష్మ లావు ప్రతి ఒక్కరూ టైఫాయిడ్ టీకాలను వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లంక రఘురామిరెడ్డి, కొల్లా సింగారావు, మనోజ్, రాజు చెంచు పున్నయ్య, దాసు నాయన, ఆదిరెడ్డి, విన్సెంట్ పాల్, స్కూల్ హెచ్ఎం సుబ్బారావు ఉపాధ్యాయని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి

ప్రజాశక్తి - వినుకొండ

బొల్లాపల్లి మండలం గండి గనుముల, దుర్గి మధ్యలో ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ప్రజాసంఘాల నాయకులు గురువారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంగాల నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డుపై రాకపోకలు జరుగుతున్నాయన్నారు. కొంతకాలంగా రోడ్డు మా భూమిలో ఉందని ఫారెస్ట్ అధికారులు బాగు చేయకుండా అడ్డుకుం టున్నారు. దీంతో రోడ్డు అధ్వానంగా మారి నిత్య ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించట్లేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డును బాగు చేసి, ప్రమాదాల నుండి నివారించి రైతులని, ప్రజలని, వాహనదారులని ఆదుకోవాలని నాయకులు కోరుతున్నారు. అనంతరం పల్నాడు జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోట నాయక్, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి శీను నాయక్, పిడియం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, నాయకులు రాంబాబు నాయక్, అంజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండల పరిధిలోని కండ్లకుంట ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై మూడు రోజుల అవగాహన కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ గాలంకి సుమంత్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఖాదర్ షాహు హుస్సేను హాజరై మాట్లాడుతూ ప్రతి మనిషికి శారీరక, మానసిక ఆరోగ్యం రెండు ముఖ్యమేనన్నారు. ఒత్తిడి, వ్యసనాలు అధిగమిస్తేనే ప్రశాంతమైన జీవితం సాధ్యమని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పాండురంగారావు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు : ఎమ్మెల్యే కన్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

2029 నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇళ్లు ఇవ్వటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక రఘురామ్ నగర్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నూతన గృహాల నిర్మాణానికి మంజూరైన 123మంది లబ్ధిదారులకు నియామక పత్రాలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం పంపిణీచేశారు. ప్రతి గ్రామంలో ఇల్లు లేని పేదలందరినీ గుర్తించి ఆన్ లైన్ లో నమోదు చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు. అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడి వెంకటేశ్వరరావు

పాసు పుస్తకం ఉన్న ప్రతి ఒక్కరూ రైతు విశిష్ట కార్డు పొందాలి

ప్రజాశక్తి - పెదకాకాని

పాస్ పుస్తకం ఉన్న ప్రతి ఒక్క రైతు ప్రభుత్వం వారు జారీ చేసే 11 అంకెల రైతు విశిష్ట కార్డును పొందాలని ప్రాజెక్టు డైరెక్టర్ గుడిపూడి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక నాల్గవ సచివాలయంలో రైతుల సమావేశం జరిగింది. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు 11 అంకెల రైతు విశిష్ట కార్డును పొందాలని, ప్రతి ఒక్క పౌరుడికి ఆధార్ కార్డు ఎంత ముఖ్యమో అలానే ప్రతి ఒక్క రైతుకి ఈ గుర్తింపు కార్డు అనేటువంటిది తప్పనిసరిగా ఉండాలి అన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ శాఖ తరపున వచ్చే పథకాలు అన్ని కూడ ఈ కార్డు కి అనుసంధానం చేసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్క పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతు ఈ కార్డు పొందాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి రమణకుమారు, పంచాయతీ సెక్రటరీ మల్లేశ్వరి, వీఆర్వో అనిల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాన్ని పేదలకు అందే విధంగా చూడాలి

ప్రజాశక్తి - పొన్నూరు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చట్టాన్ని ప్రతి పేదవానికి అందేలా చూడాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక షరాఫ్ బజార్ హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంక్ దగ్గర పట్టణ న్యాయవాది జొన్నకూటి లక్ష్మీకాంత్ నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖ న్యాయవాదులు వట్టికూటి లీలా ప్రసాద్, మక్బుల్ బేగ్, జిఎస్ రాయల్, షేక్ బాజీ సాహెబ్ తెలుగు దేశం పార్టీ నాయకులు ఫిరోజ్ ఖాన్, షేక్ బాబ్జి, మహమ్మద్ గౌస్, లక్ష్మణ, అలీషా, పొన్నూరు పట్టణ వైసీపీ నేతలు నన్నపనేని అంకినీడు చౌదరి, షేక్ షఫైతుల్లా నాగరాజు ఆకుల వెంకటేశ్వరరావు, మహమూద్ మాము పాల్గొన్నారు.

రైతన్న మీకోసం వారోత్సవాలను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలో రైతన్న మీకోసం వారోత్సవాలను విజయవంతం చేద్దామని తహశీల్దార్ జె.ప్రసాదరావు, వ్యవసాయ అధికారి జె.వాసంతి రైతులకు పిలుపునిచ్చారు. రైతన్న మీకోసం వారోత్సవాల్లో భాగంగా గురువారం గుండాలపాడు గ్రామంలో అధికారులు సందర్శించి రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వం ఈనెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ప్రతి గ్రామంలో వ్యవసాయంతో పాటు ఉద్యాన ఇతర పంటలపై ప్రభుత్వం కల్పించే నీటి భద్రత, డిమాండ్, ఆధారిత పంటలు, అగ్రిటెక్ అనగా సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు పండించడం, ఫుడ్ ప్రాసెసింగ్ అనగా రైతులు పండించిన పంటలకు అధిక ధరలకు ప్రాసెస్ చేసి అమ్మడం వంటి ప్రభుత్వం నుంచి మద్దతు అంశాలపై రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మండవ నరసింహారావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి కోటేశ్వరావు, టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ ఆళ్ల కృష్ణమూర్తి, సర్పంచి కాండ్రు దాసయ్య, రైతులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వ్యవసాయకూలీలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ అధికారిగా వెంకటరావు

ప్రజాశక్తి - దుగ్గిరాల

దుగ్గిరాల మండలం గ్రామ సచివాలయ అధికారిగా టి.వెంకట్రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పెనుమూలి గ్రామ కార్యదర్శిగా పనిచేసే పదోన్నతి పొందారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు సూపరింటెండెంట్ వి.చంద్రమోహన్, ఈఓపిఆర్‌డి జవహల్‌లాల్ నెహ్రూ ఆయనకు అభినందనలు తెలిపారు.

అక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలి

ప్రజాశక్తి - తెనాలి



ఆక్రమణలు పరిశీలిస్తున్న పోలీసులు

పట్టణ త్రీ టన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని పోలీసులు హెచ్చరించారు. సీఐ ఎస్.సాంబశివ రావు నేతృత్వంలో చెంచుపేట ప్రాంతంలో ఆక్రమణలను గురువారం పరిశీలించారు. వివిధ షాపుల నిర్వాహకులు, చిరు వ్యాపారులు రోడ్డు మీదకు రావడం పట్ల ఆగ్రహించారు. ప్రధాన రోడ్ల వెంట ఆక్రమణలు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని, వాటిని తక్షణమే తొలగించాలని ఆక్రమణదారులను కోరారు. తొలగించని పక్షంలో తామే స్వయంగా తొలగించాల్సి ఉంటుందంటూ హెచ్చరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలిగ్...

పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు రౌడీ షీటర్ల ఇళ్లకు వెళ్లి గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీ షీట్ ఉన్నప్పటికీ ఐదుకు పైగా కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని ఘాటుగా హెచ్చరించారు. రౌడీ షీటర్ల తల్లిదండ్రులతో మాట్లాడారు. నిత్యం వారి కదలికలపై పోలీసుల నిఘా ఉంటుందని, ప్రవర్తన మార్చుకోవాలని, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని సిఐ సాంబశివరావు హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై ఎన్.ప్రకాశరావు, సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది : సబ్ కలెక్టర్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్, వ్యవసాయశాఖ సిబ్బంది

ప్రజాశక్తి - కొల్లిపర

ప్రభుత్వము రైతుల వద్ద నుండి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉందని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం కొల్లిపర మండలంలోని దావులూరు చివలూరు గ్రామాలలోని రైతులకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు దళారీలకు అమ్ముకోవద్దని ప్రభుత్వం మీ దగ్గర నుంచి ధాన్యం మద్దతు ధరకుకొనుగోలు చేస్తుంది కావున రైతులందరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం రైతన్న మీకోసం కరపత్రాలను రైతులతో కలిసి ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సిద్ధార్థ మండల వ్యవసాయ అధికారి ఎం.శ్రీనివాస్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

పంటల సాగును లాభసాటిగా మార్చేందుకే 'రైతన్నా - మీకోసం'

ప్రజాశక్తి - తుళ్లూరు

పంటల సాగును లాభదాయకంగా మార్చడమే లక్ష్యంగా 'రైతన్నా - మీ కోసం' కార్యక్రమాన్ని చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.సంధ్యారాణి చెప్పారు. గురువారం మండలంలోని పెదపరిమిలో రైతన్న - మీకోసం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్క రైతు కుటుంబాలను కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ ద్వారా ప్రభుత్వం రూ 20వేలను ఏడాదికి మూడు దఫాలుగా రైతుల ఖాతాలో జమ అవుతాయని ఎఓ తెలిపారు. వడ్డమాను, హరిశ్చంద్ర పురం లోనూ రైతన్న న్నా మీకోసం కార్యక్రమం నిర్వహించినట్లు ఎఓ చెప్పారు. కార్యక్రమంలో రైతులతో పాటు టిడిపి నాయకులు ధనేకుల సుబ్బారావు, పుట్టి రామచంద్ర రావు, దామినేని శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షులు రాయపాటి హరిబాబు,సొసైటీ ప్రెసిడెంట్ భాష్యం శ్రీధర్, కొండవీటి విజయ రాజ్ కుమార్, మక్కెన పాపారావు, గ్రామ వ్యవసాయ, పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.



ఎలిమెంటరీ పాఠశాలలో బుక్స్ పంపిణీ చేస్తున్న నాయకులు, తాడేపల్లిలో దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా మారుతి ఫౌండేషన్ అధినేత జంగాల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

తెలుగుదేశం తాడేపల్లి పట్టణ మాజీ అధ్యక్షులు , మారుతి ఫౌండేషన్ అధినేత జంగాల సాంబశివరావు 64వ జన్మదిన వేడుకలు తెలుగు యువత గుండిమెడ గ్రామ తెలుగు యువత నాయకులు గుడిసె సాంబశివ రావు ఆధ్వర్యంలో ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాలలో గురువారం ఉదయం ఘనంగా జరిగాయి. సాంబశివరావు జన్మదినోత్సవం సందర్భంగా టిడిపి, తెలుగు యువత నాయకులు కేక్ కట్ చేసి, జంగాల సాంబశివరావుకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ, పండ్లు, స్వీట్స్ ను నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ తెలుగు యువత నాయకులు గుడిసె సాంబశివరావు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి దావులూరి శ్రీనివాసరావు, ప్రసన్నలయ రియల్ ఎస్టేట్ అధినేత చొప్పర బుల్లిబాబు, మేడికొండ వెంకటేశ్వర్లు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో జంగాల సాంబశివరావు (జెఎస్ఆర్) పుట్టిన రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేశారు. తాడేపల్లి చిగురు అనాథ ఆశ్రమంలో చిన్నారులకు అల్పాహారం అందజేశారు. ఉండవల్లిలో 80 మంది పారిశుధ్య, రిక్షా, ముఠా కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఆత్మకూరు పి.జి.ఎం.చిల్డ్రన్స్ హోంకి వాషింగ్ మిషన్, 25 స్కూల్ బ్యాగ్‌లు అంద చేశారు. సుందరయ్య నగర్ కట్టపై గల కొండ పావులూరు గార్డెన్ 10 మంది పేద విద్యార్థులకు 5 వేల రూ.చొప్పున రూ.50 వేలు రూపాయలు ఆర్థిక సహాయం అంద చేశారు. లింగం శెట్టి అసోసియేట్స్ కార్యాలయం వద్ద ముందుగా కేక్ కట్ చేశారు. 80 మంది పారిశుధ్య కార్మికులకు (రిక్షా, ముఠా) నూతన వస్త్రాలను బహుకరించారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్, లింగం శెట్టి అసోసియేట్స్ అధినేత కిషోర్ కుమార్, టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్,జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు,టీడీపీ తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కఅష్ణ, తెలుగు రైతు గుంటూరు పార్లమెంట్ అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, స్టాలిన్, శెట్టి కేశవరావు, బుల్లిబాబు, జ్యోతి బస్,వంగా నరేంద్ర,గాదె శ్రీను, యర్రం శెట్టి రాము, సింగం శెట్టి, శ్రీనివాసరావు,లీలా తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

359 రోజులుగా సిమెంట్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 359 రోజులకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ముసలా సాంబశివరావు. ప్రారంభించారు. దీక్షలలో బి.సూర్యప్రకాష్, సిహెచ్.పిచ్చయ్య, జి.కొండలు, స్వర్ణల వెంకటరమణ, దామవరపు నాగేశ్వరావు కూర్చున్నారు. కార్యక్రమంలో జానీ, హిమాంభి, శారమ్మ, రమాదేవి, శారదా, నవనీతమ్మ, లక్ష్మి, రమణమ్మ, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బ్యాంకు, వ్యవసాయ అధికారులు

రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు

రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.పద్మావతి కోరారు. గురువారం బ్యాంక్ ఆఫ్ బరోడా కిసాన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతిమాట్లాడారు. రైతన్న మీకోసం కరపత్రాలను బ్యాంక్ సిబ్బందికి హాజరైన రైతులకు అందజేసినారు. రైతులకు మేలు చేయడానికి సాగునీటి పొదుపు,డిమాండ్ ఆధారిత పంటలు వేసుకోవడం, అగ్రిటెక్ టెక్నాలజీని వాడుకోవడం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి వాటి గురించి వివరించారురు. అనంతరం వరగాని గ్రామం లో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. సబ్సిడీ శనగ విత్తనాలును రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బరోడా బ్యాంక్ గుంటూరు ఆర్‌ఎం కిరణ్ రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి, పెదనందిపాడు బ్యాంకు మేనేజర్ వంగవీటి వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం రైతు సోదరులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్రమంత్రి రాందాస్ అత్వాలేతో గంగాధర్

పొన్నూరు వాసి గంగాధర్‌కు నేషనల్ ఎక్సలెన్స్

ప్రజాశక్తి - పొన్నూరు

నిడుబ్రోలుకు చెందిన పీపుల్స్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు గూడవల్లి గంగాధర్‌కు నేషనల్ సోషల్ సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత భూషణ్ అవార్డుల్లో భాగంగా అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. సోషల్ సర్వీస్ కేంద్రమంత్రి రాందాస్ అత్వాలే అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో అవార్డు అందుకోవటం తనకి ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. గూడవల్లి గంగాధర్‌కు పలువురు పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

పీజీ పరీక్షల షెడ్యూల్లో మార్పులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ పరీక్షల షెడ్యూల్లో మార్పులు చేపట్టినట్లు పరీక్షల నిర్వహణ అధికారి శివప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. అన్ని పరీక్ష పేపర్లకు ఫీజు రూ. 980 చొప్పున డిసెంబర్ 1 వ తేదీ లోగా చెల్లించాలన్నారు. పరీక్షలు డిసెంబర్ 8వ తేదీ నుండి ప్రారంభమవుతాయని ప్రకటించిన నోటిఫికేషన్ రద్దయిందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సూచన మేరకు పీజీ పరీక్షలు జరిగే తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

వర్సిటీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సాంఖ్యక శాస్త్రం మరియు గణిత విభాగం కంప్యూటర్ ప్రయోగశాలను గురువారం ప్రారంభించారు. పూర్వ రిజిస్ట్రార్ ఆర్ ఆర్ ఎల్ కాంతం ముఖ్యఅతిథిగా హాజరై ల్యాబ్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో కె చందన్, కే రోశయ్య ఏ వాసుదేవరావు బి.సత్య నారాయణ, ఎం జ్ఞానేశ్వర్ రెడ్డి, డాక్టర్ కె శివప్రసాద్, ఆచార్య ఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఆర్‌విఆర్ జెసిలో ముగిసిన రాజ్యాంగ దినోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం మూలాధారమని, యువత రాజ్యాంగ స్ఫూర్తిని ఆచరణలో పెట్టినప్పుడు మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యం బలపడుతుందని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని అన్నారు. కళాశాలలో రెండ్రోజులపాటు నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకలు గురువారం ముగిశాయి. రాజ్యాంగంలోని వివిధ అంశాలపై వక్తత్వం, వ్యాసరచనం, పోస్టర్ ప్రదర్శనల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్, డైరెక్టర్ తదితరులు

19, 20 తేదీల్లో కళ్లం కాలేజీలో సంకల్ప్

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం ఇంజినీరింగ్ కాలేజిలో డిసెంబర్ 19, 20 తేదీల్లో జాతీయస్థాయి సాంకేతిక, మేనేజ్మెంట్ సదస్సు (సంకల్ప్- 2025) నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం సంకల్ప్ గోడప్రతులను చైర్మన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మా ఇంజి నీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక, మేనేజ్మెంట్ సదస్సు (సంకల్ప్- 2025)ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రాష్ట్ర, జాతీయస్థాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని వారి సాంకేతిక, మేనేజ్మెంట్ విభాగాలలో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించడం ద్వారా పెద్ద ఎత్తున పారితోషికాలు అందుకోవడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.బి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధిపతులు, కళ్లం భరద్వాజ, సంకల్ప్- 2025 నిర్వహణ సంచాలకులు డాక్టర్ హనుమంత్‌ప్రసాద్, కళాశాల డీన్- ఉపాధి కల్పన విభాగం డాక్టర్ పి.ఎల్.మాధవరావు పాల్గొన్నారు.

ముగిసిన కిట్స్ కాలేజి ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలతో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల వారం రోజుల సేవా శిబిరంలో భాగంగా వింజనంపాడు గ్రామంలో పలు సేవా కార్యక్ర మాలు, అవగా హనా సదస్సులు, మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు గ్రామంలోని ప్రజల జీవన విధానాన్ని, వ్యవసాయ పద్ధతుల గురించి తెలుసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు తెలియచేశారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్

గురువారం చివరి రోజు విద్యార్థులు గ్రామంలో ఓటు హక్కు ప్రాధాన్యత గురించి ప్రజలకు తెలియచేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎం సుధాకర్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా.కె.హరిబాబు, డాక్టర్ మురళి, డాక్టర్ భానుప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.చంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డుసచివాలయాల వారీగా జరుగుతున్న సమగ్ర సర్వే వేగంగా పూర్తి చేయాలని, నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం స్థానిక ఆకులవారితోటలోని 83, 84 వార్డు సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, సర్వే ఆన్ లైన్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో సమగ్ర సర్వే ఖచ్చితమైన వివరాలతో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి కార్యదర్శి తమకు కేటాయించిన క్లస్టర్‌లో ప్రజలకు సర్వే అంశంపై వివరించి, నిర్దేశిత ఫార్మేట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యదర్శులు ఐడి కార్డులను తప్పనిసరిగా ధరించాలన్నారు. సర్వే పర్యవేక్షణకు విభాగాధిపతులు, సీనియర్ అధికారులను కేటాయించామని, తాము కూడా క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. వివరాలు ఆన్‌లైన్ చేయడంలో సాంకేతిక సమస్యలు ఎదురైతే పిఎంయు టీంతో సంప్రదించాలన్నారు. నగర ప్రజలు


రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

తమ ఇంటి వద్ద నుండే పురపాలక సేవలు పొందేలా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పురమిత్ర, మన మిత్ర యాప్‌లను కూడ డౌన్లోడ్ చేసుకునేలా అవగాహన కల్గించాలన్నారు. అనంతరం సచివాలయ భవన సమస్యలను కార్యదర్శులు, నోడల్ అధికారి వివరించగా తగుచర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యటనలో నోడల్ అధికారి పోలేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలపై చలపతి ఫార్మసీలో సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఐజిసిసి-ప్రో రికగ్నైజ ేషన్ సహకారంతో జర్మన్ కెరీర్ పాత్‌వేస్ అవగాహన కార్యక్రమం గురువారం లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండో జర్మన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుండి డెనిస్ ఎచ్‌హాన్ మాట్లాడుతూ జర్మనీలో నైపుణ్యాల ఆధారిత కెరీర్ సేవలు, జర్మన్ ఉద్యోగ విపణిలో కొనసాగుతున్న నైపు ణ్యాల కొరత, విద్యార్థులు పొందగలిగే స్థిరమైన ఉద్యోగాలు, మంచి వేతనాలు, కెరీర్ ఎదుగుదల వంటి విషయాలను వివరించారు. విదేశాల్లో స్థిరమైన భవిష్యత్ కోసం జర్మనీ ప్రస్తుతం అత్యుత్తమ గమ్యస్థానంగా ఉందన్నారు. జర్మనీ వాతావరణం, జీవనశైలి, సంస్కృతి, భద్రత, విదేశీ విద్యార్థులకు ఉన్న అనుకూలతలు వంటి అంశాలను పూర్తిగా అర్థం చేసుకోవాలని, జర్మన్ ప్రమాణాలకు అనుగుణంగా కరిక్యులమ్ వీటా తయారీ విధానం, దరఖాస్తు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సంజీవరావు, ఎపిఎస్ఎస్‌డిసి అసోసి యేట్ మేనేజర్ ఎ.ధర్మేంద్ర మాట్లాడుతూ జర్మ నీలో ఫార్మసీ, హెల్త్‌కేర్, ఇంజినీరింగ్, ఐటి, టెక్ని కల్ సర్వీసులు వంటి విభాగాల్లో ఉన్న అవ



మాట్లాడుతున్న డెనిస్ ఎచ్‌హాన్

కాశాలను విద్యార్థులకు తెలియ జేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

పశ్చిమలో రూ.16.44 కోట్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలలో రూ. 16.44 కోట్ల విలువైన పనులకు గురువారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర శంకుస్థాపన చేశారు. రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, వాటర్ పైప్‌లైన్లు వంటి కీలక మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేశామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... "కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గుంటూరు పశ్చిమలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, 8 డివిజన్లలో 16 కోట్లకు పైగా అభివృద్ధి పనులకి ఒకే రోజు శంకుస్థాపన చేయటం జరిగింది. ప్రజలు కోరిన ప్రతి అభివృద్ధి పనిని వెంటనే అంచనాలు తయారు చేయించి మంజూరు చేయడంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే



గళ్ళా మాధవి తెలిపారు. కాంట్రాక్టర్లు తీసుకున్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొని రావాలన్నారు. గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి రత్నగిరి, పలకలూరు ప్రాంతాల వరకు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు.

శ్మశాన వాటికలను అభివృద్ధి చేయండి

నగర కమిషనర్‌కు తూర్పు ఎమ్మెల్యే నసీర్ వినతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

హిందూ శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీని వాసులును గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. గురువారం నగర కమిషనర్ ఛాంబర్లో ఆయనను కలిసిన ఎమ్మెల్యే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై చర్చించారు. పాత గుంటూరు, డీసీ నగర్ ప్రాంతాల్లో హిందూ శ్మశాన వాటికల్లో సరైన సౌకర్యాలు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. వీటికి వెంటనే అనుమతులిచ్చి అభివద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. దీంతోపాటు బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ ఐలాండ్, నాజ్ సెంటర్, హిందూ కాలేజీ వద్ద ఐలాండ్‌లను సుందరీకరించాలని కోరారు. వీటి అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలన్నారు. గుంటూరు తూర్పు నియోజక వర్గంలో ఇప్పటికే ప్రారంభమైన అభివద్ధి పనుల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కనిపిస్తోందని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లకు వెంటనే నోటీసులు జారీ



చేయాలని, అవసరమైతే వారిని తొలగించి కొత్త వారికి అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు.

పిఆర్‌సి కమిటీని సత్వరమే ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కోసం తక్షణమే ప్రభుత్వం పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేయాలని ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు కోరారు. అసోసియేషన్ గుంటూరు సిటీ యూనిట్ నూతన కార్యవర్గ సమావేశం గురువారం సిటీ అధ్యక్షులు ఎస్‌పిఎస్ సూరి అధ్యక్షతన ఎపిఎన్‌జిఒ హోంలో నిర్వహిం చారు. తొలుత 20 ఈసీ సభ్యుల కోఆప్షన్ ఎన్నిక జరిగింది. కార్యదర్శి సిహెచ్ కళ్యాణ్ కుమార్ ప్రవేశపెట్టిన ఎజెండా తీర్మానాలపై చర్చ జరిగినది. ప్రధానంగా గ్రామ వార్డు సచివాలయాల ఏఎన్ఎంలకు కేవలం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన విధులను మాత్రమే అప్పచెప్పే విధంగా జిల్లా రాష్ట్ర సంఘ నాయకత్వాల ద్వారా గ్రామ వార్డు సచివాలయాల శాఖ నుండి ఉత్తర్వులు ఇప్పించే విధంగా ముందుకెళ్లాలని తీర్మానించారు. ఇహెచ్ఎస్ ద్వారా క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ అందించాలని, బకాయిలు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆరాధ్యుల శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్.నాగూర్ షరీఫ్, సిటీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శుల్ని అభినందిస్తున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు